జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


శుక్రవారం | 14-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 754 పేజీలు: 4 వెల : రూ.7





* పైసా కొట్టు.. శాలరీ పట్టు! * పలాస కిడ్నీ ఆసుపత్రిలో కొందరిపై ఉద్యోగుల ఆరోపణలు * జీతాల ఫైళ్ల కదలికకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఫిర్యాదులు * కొత్తగా చేరిన సిబ్బందిపైనా ఒత్తిడి * ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఉద్యోగుల విజ్ఞప్తి * 'హరి' ఓం ఆగడాలకు చెక్ పడేది ఎన్నాడో? * సిబ్బంది వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న 'హరి' ఓం బాగోతం

# హరి ఓంకు.. సమర్పయామీ..!




పలాస, ఆగస్టు 13 (వార్త): పలాస కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిలో ఉద్యోగుల జీతాల చెల్లింపులకు సంబంధించిన ఫైళ్ల కదలికపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెల జీతాల ప్రక్రియ సమయంలో కొంతమంది సిబ్బంది నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. సంబంధిత వ్యక్తికి డబ్బులు చెల్లించకపోతే జీతాల ఫైళ్లు ముందుకు కదలడం లేదని కొంతమంది ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. హరి ఓంకు పైసలు 'ముట్టజెప్పకపోతే జీతాలు ఆలస్యం' అనే వాదన ఆసుపత్రిలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగుల వాదన. నెలనెలా జీతాల ప్రక్రియలో ఇదే పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన సిబ్బందికి సంబంధించిన పత్రాలు, ఫైళ్ల విషయంలోనూ డబ్బులు చెల్లించాల్సి వస్తోందని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లోనూ ఈ విషయమై చక్కర్లు కొడుతున్నాయి. సిబ్బందిలో అసంతృప్తి "హరి" ఓం తీరుతో తమపై అనవసర ఒత్తిడి పెరుగుతోందని కొంతమంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెల జీతాల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సంబంధిత వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని వారు కోరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.


## విధులకు హాజరుపైనా ఆరోపణలు..

ఇదిలా ఉండగా.. విధులకు సంబంధించిన హాజరు విషయంలోనూ నిబంధనలు పాటించడం లేదని కొంతమంది ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారంలో కొన్ని రోజులు మాత్రమే విధులకు హాజరై మిగిలిన రోజుల్లో వ్యక్తిగత కార్యకలాపాలకు వెళ్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ అంశాలపై అధికారిక హాజరు రికార్డులను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఉన్నతాధికారులు స్పందించాలి

జీతాల చెల్లింపులు, సిబ్బంది ఫైళ్ల నిర్వహణ, హాజరు నమోదు వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని ఉద్యోగులు కొందరు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవాస్తవాలైతే వాటిని స్పష్టం చేసి ఉద్యోగుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరిన్ని వివరాలతో త్వరలో 'జాతీయ వార్త'లో మరో కథనం




# మున్సిపల్ పోరు..



* రేసులో ఆశావహులు * సందిగ్ధంలో పార్టీలు
* అభ్యర్థులు కొందరిలో మోదం.. మరికొందరిలో ఖేదం


# ప్రత్యక్షమా.. పరోక్షమా!

ఇచ్ఛాపురం, ఆగస్టు 13 (వార్త): మున్సిపల్ ఎన్నికలతో పాటు అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు పరోక్ష విధానంలో కాకుండా ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు గత కొద్దిరోజులుగా చర్చ జరగడంతో సందిగ్ధం నెలకొంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులలో కొందరిలో మోదం మరి కొందరిలో ఖేదం నెలకొంది. ఆశావాహుల్లో చివర వరకు ఉత్కంఠ రేకెత్తిస్తోంది. కొందరు అభ్యర్థులలో నైరాశ్యం చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ఆవిర్భవించి సుమారు 40 ఏళ్ళు పూర్తవుతుంది. 1986లో మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. అప్పటివరకు గ్రామ పంచాయతీలుగా ఉన్న రత్తకన్న, పురుషోత్తపురం, అమీన్ సాహెబ్ పేట పంచాయతీల విలీనంతో మున్సిపాలిటీగా అవతరించింది. 20వార్డులతో మున్సిపాలిటీ ఏర్పాటు చేశారు. 1987లో తొలిసారిగా మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరగకగా కాంగ్రెస్ పార్టీ నుండి పిలక పద్మావతి రెడ్డి, తెలుగుదేశం పార్టీ నుండి బుద్దాల నిర్మలారెడ్డిలు పోటీ చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పిలక పద్మావతి రెడ్డి విజయం సాధించారు. వార్డుల విషయానికి వస్తే 20 వార్డుల్లో కేవలం 9 వార్డులు మాత్రమే కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. మిగిలిన 11 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేశారు. దీంతో మెజార్టీ వార్డు స్థానాలు తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడంతో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా గుజ్జు గంగాధర్ రెడ్డిని ఎన్నుకున్నారు. 1987 నుండి 92 మధ్యకాలంలో ఐదేళ్లపాటు పాలన తీవ్ర ఉత్కంఠతో సాగింది. కాంగ్రెస్ చైర్పర్సన్ తెలుగుదేశం వైస్ చైర్పర్సన్ మధ్య ప్రతి సమావేశంలో పై చేయి కోసం అజెండా ఉత్కంఠంగా సాగింది. అనంతరం 1994లో రెండోసారి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున కాళ్ల వెంకటలక్ష్మి చైర్ పర్సన్ గా గెలుపొందింది. అప్పటి ప్రత్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పిలక జగదాంబపై వెంకటలక్ష్మి గెలుపొందారు. వార్డులు సైతం తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడంతో వైస్ చైర్మన్‌గా ఆసి బాలయ్యని ఎన్నుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఒకే ఒక్కసారి 2004లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గెలుపొందగా అందుకు విరుద్ధంగా మున్సిపాలిటీ ఆవిర్భావం నుండి ఒకే ఒక్కసారి 1994 లో మాత్రమే తెలుగుదేశం పార్టీ గెలవడం విశేషం. అనంతరం 1999 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పిలక పోలారావు ప్రత్యక్ష ఎన్నికల్లో చైర్మన్‌గా గెలుపొందారు. అప్పటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కాళ్ల దేవరాజు పోటీ చేశారు. అప్పటి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వార్డులు కూడా అధిక శాతం కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో ఉశాల బాలయ్యని ఎన్నుకున్నారు. మొత్తం ఆరు పర్యాయాలు మున్సిపల్ ఎన్నికలు జరగగా కేవలం ఒకే ఒక పురుష అభ్యర్థి పోలారావు చైర్మన్‌గా పని చేశారు. మిగిలిన అన్ని పర్యాయాలు మహిళలే చైర్ పర్సన్‌లుగా కొనసాగడం విశేషం. అనంతరం 2005లో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పరోక్ష విధానంలో మున్సిపల్ ఎన్నికలు చేపట్టారు. 2005లో జరిగిన పరీక్ష ఎన్నికల్లో మున్సిపాలిటీలో 23 వార్డులకు పెరిగాయి. 13 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందడంతో పరోక్ష విధానంలో కౌన్సిలర్లు చేతులెత్తి లాభాల స్వర్ణమణిని మున్సిపల్ చైర్పర్సన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉశాల బాలయ్యను రెండోసారి ఎన్నుకున్నారు. అనంతరం నాలుగేళ్ల పాటు ఎన్నికలు జరగలేదు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి చైర్పర్సన్ గా పిలక రాజ్యలక్ష్మిని ఎన్నుకున్నారు. పరోక్ష విధానంలో 13 వార్డులలో వైస్సార్సీపీ గెలుపొందగా 1 వార్డులో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొంది తెలుగుదేశం పార్టీలో చేరారు. 9 వార్డులలో తెలుగుదేశం గెలుపొందింది. వైస్ చైర్ పర్సన్‌గా కాళ్ల శకుంతలను ఎన్నుకున్నారు. 2019లో మరోసారి జరిగిన ఎన్నికల్లో పిలక రాజ్యలక్ష్మి చైర్పర్సన్‌గా రెండోసారి ఎన్నుకున్నారు. 23 వార్డులకి గాను 15 వార్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. రెండు వార్డుల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలపొందగా వారు కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో తెలుగుదేశం కేవలం ఆరు వార్డులకే పరిమితం అయ్యింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండో వైస్ చైర్ పర్సన్ పదవిని తెరపైకి తేవడంతో ఉశాల భారతీయ దివ్యతో పాటు లాభాల స్వర్ణమనిని వైస్ చైర్పర్సన్ గా ఎన్నుకున్నారు. ప్రస్తుతం మరోసారి ప్రత్యక్ష ఎన్నికలు విధానం పై చర్చ జరుగుతుండడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రత్యక్ష ఎన్నికల్లో చైర్ పర్సన్ అభ్యర్థిని పార్టీలు ముందే ప్రకటిస్తాయి. దీంతో మిగిలిన రేసులో ఉన్న చైర్పర్సన్ అభ్యర్థులు పోటీకి నిరాకరిస్తారు. వార్డులలో కౌన్సిలర్ స్థానానికి పోటీ చేయకుండా తమ అనుచరులను బరిలో ఉంచి చేతులు దులుపుకునే అవకాశం ఉంది. కేవలం వైస్ చైర్పర్సన్‌కు స్థానానికి ఆశ పడేవారు మాత్రమే కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. మిగిలిన వారు పోటీ చేసే అభ్యర్థికి సహాయ సహకారాలు కూడా అందించడానికి మొఖం చాటేస్తారు. మరోవైపు చైర్ పర్సన్ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థిపై ఉన్న ముద్ర మొత్తం మున్సిపాలిటీపై పడుతుంది. స్థానిక సంస్థల్లో పార్టీలను కాకుండా వ్యక్తిత్వం చూసి ఓటు వేసే అవకాశం ఉన్నందున దాని ప్రభావం వార్డుల్లో కూడా ఉంటుంది. ఒకవేళ చైర్పర్సన్ అభ్యర్థి ఒక పార్టీలో గెలుపొందిన అధికంగా వేరే పార్టీ అభ్యర్థులు వార్డులు గెలుపొందితే ఇక ప్రతి నెల కౌన్సిల్ సమావేశంలో ఎజెండా అంశాలు ఆమోదం కావడానికి అధికారులకు తల ప్రాణం తోకకి వస్తుంది. ఏదేమైనప్పటికీ ప్రస్తుతం ఆలు లేదు చూలు లేదు అన్న చందంగా ఇక చర్చల దశలో ఉన్న ఈ ప్రతిపాదన ఏ పార్టీని ఉంచుతోందో ఏ అభ్యర్థిని ముంచుతుందో వేచి చూడాలి.











జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# రాకాసి అలలకు మత్స్యకారుడి బలి

- వేటకు వెళ్లి తెప్ప బోల్తా
- మత్స్యకారుడి మృతి
- వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో విషాదం

**పలాస, ఆగస్టు 13 (వార్త):** సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు రాకాసి అలల తాకిడికి మృత్యువాత పడ్డాడు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట గ్రామానికి చెందిన సూరాడ విశాఖ (45) గురువారం సముద్రంలో వేటకు వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తోటి మత్స్యకారులతో కలిసి విశాఖ సముద్రంలోకి వేటకు వెళ్లారు. వేట కొనసాగుతున్న సమయంలో సముద్రంలో ఒక్కసారిగా ఎగసిపడిన భారీ అలల తాకిడికి తెప్ప బోల్తాపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో సూరడ విశాఖ మృతి చెందినట్లు ఆయన భార్య దానమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని సమయంలో సముద్రంలోకి వెళ్లడం ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో ముందస్తు హెచ్చరికలు, భద్రతా చర్యలపై మరింత అప్రమత్తత అవసరమని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. సముద్రంలో వేటకు వెళ్లిన కుటుంబానికి తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న వేళ విషాద వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోవడంతో మృతుడు విశాఖకు భార్య దానమ్మతో పాటు కుమారుడు తిరుపతి రాజు, కుమార్తెలు ప్రేమ, వాణి ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తి మృతి చెందడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. మత్స్యకార కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు, ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు. మత్స్యకారుడి మృతితో మంచినీళ్లపేటలో విషాద వాతావరణం నెలకొంది.



## స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటి చెబుదాం



**సోంపేట, ఆగస్టు 13 (వార్త):** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరం భారత స్వాతంత్రం స్ఫూర్తిని చాటి చెబుదామని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు, ఎంపీడీవో ఈశ్వరమ్మ, డిప్యూటీ ఎంపీడీవో శాంతకుమారి తదితరుల ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. త్రివర్ణ పతాకాలు చేత పట్టుకొని నినాదాలు చేస్తూ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదగా ర్యాలీ చేపట్టారు. ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్రం కోసం ఎన్నో పోరాటాలు చేసి ఎంతోమంది ఆత్మ త్యాగం చేశారని గుర్తు చేశారు. అటువంటి మహనీయుల ను స్మరించుకోవడం ఈ సందర్భంగా మనందరి కర్తవమని పేర్కొన్నారు.

## లక్ష్మీనర్సుపేటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి


- లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎంకే మిశ్రో డిమాండ్






**ఎల్ఎన్ పేట, ఆగస్టు 13(వార్త):** గతంలో లక్ష్మీ నర్సుపేట గ్రామం మీదుగా మిరియాపల్లి, వాడవలస, డబ్బపాడు, తురకపేట గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేదని ప్రస్తుతం బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర దివ్యాంగ సంఘ నాయకులు, ఉత్తమ ఉపాధ్యా యులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎంకే మిశ్రో ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ నర్సుపేట గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ ఎస్సీ బాలల హాస్టల్, జడ్పీహెచ్ఎస్ స్కూల్ తదితర కార్యాల యాలకు, పాఠశాలకు వెళ్లడానికి ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆయన తెలిపారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలుగజేసుకొని లక్ష్మీ నర్సుపేట గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎంకే మిశ్రో ఒక ప్రకటనలో కోరారు.

## కొర్ల కన్నారావుకు ఘన సన్మానం



**మందస, ఆగస్టు 13(వార్త):** అరసవల్లి దేవాలయం ట్రస్టు బోర్డు మెంబరుగా నియమితులైన సమాజసేవకుడు, పారిశ్రామిక వేత్త కొర్ల కన్నారావు ఘనంగా సన్మానించారు. మందస మండలంలోని బిన్నళమదనాపురం పంచాయతీలోని వెంకటవరదరాజపురంలో గల కన్నారావు స్వగృహానికి వెళ్లి అభినందనలు తెలిపారు. కన్నారావు అభిమానులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు ఆయనకు దుశ్శాలువలతో పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా సమాజ సేవలో కన్నారావు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్పు వెంకటేశం, గుంట జానకిరావు. కొంచాడ సురేష్ కుమార్, జగదీష్ పండా, ఖగేష్, మధు బాబు, వెంకటరావు, ఇప్పిలి చంద్రశేఖర్, గ్రామస్తులు పెద్ద పాల్గొన్నారు.

## గుగ్గిలిలో విద్యార్థులకు కంటి పరీక్షలు

**జలుమూరు, ఆగస్టు 13(వార్త):** గుగ్గిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారామెడికల్ ఆప్తాలమిక్ సహాయకురాలిగా పనిచేస్తున్న కింజరాపు రామేశ్వరి విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే కంటి చూపు పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాలలో మొత్తం 29 మంది విద్యార్థులు ఉండగా వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల్లో అవసరం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా భవిష్యత్తులో చూపు సంబంధిత ఇబ్బందులను నివారించవచ్చని ఆమె తెలిపారు.






## హిరమండలం ఐటీడీఏ ఫిల్లింగ్‌స్టేషన్ నందు

# నో ఫోన్ పే .. ఓన్లీ క్యాష్

- బోర్డుల ఏర్పాటు
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

**హిరమండలం, ఆగస్టు 13(వార్త):** హిరమండలం పరిధిలో ఉన్న ఐటీడీఏ ఫిల్లింగ్ స్టేషన్ ( పెట్రోల్ బంక్ ) నందు ఫోన్ పే లేదని ఓన్లీ క్యాష్ కే పెట్రోల్ డీజిల్ దొరుకుతుందని అక్కడ ఫీలింగ్ స్టేషన్ నందు నో ఫోన్ పే, ఓన్లీ క్యాష్ అంటూ బోర్డులను అక్కడ సిబ్బంది ఏర్పాటు చేసి ఉన్నారు... ఈ ఐ టి డి ఏ ఫిల్లింగ్ స్టేషన్ నందు ఫోన్ పే లేనందువలన వాహన చోదకులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఆన్లైన్ ద్వారా నగదు లావాదేవీలు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఐ టి డి ఏ ఫిల్లింగ్ స్టేషన్ నందు ఫోన్ పే లావాదేవీలు జరగడంలేదని పెట్రోల్ బంకులో ఫోన్ పే లేకుండా ఓన్లీ క్యాష్ నకే పెట్రోల్ డీజిల్ దొరుకుతుందని అక్కడ సిబ్బంది చెబుతున్నారని పలువురు వాపోతున్నారు.. దీనిపై ఫిల్లింగ్ స్టేషన్ మేనేజర్ ఆదినారాయణ ను జాతీయ వార్త వివరణ కోరగా ఫోన్ పే ద్వారా వస్తున్న డబ్బులు సరిగ్గా అకౌంట్లో చేరడం లేదని దీనివలన కొద్ది రోజులు ఈ యొక్క లావాదేవీలు నిలుపుదల చేయడం జరిగిందన్నారు. దీనిపై ఎస్ బి ఐ బ్యాంకు సిబ్బంది తో మాట్లాడి త్వరలోనే యధావిధిగా ఫోన్ పై ద్వారా లావాదేవీలు కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలుగజేసుకొని హిర మండలం పరిధిలో ఉన్న ఐటీడీఏ ఫిల్లింగ్ స్టేషన్ నందు ఫోన్ పే ద్వారా లావాదేవీలు కొనసాగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.






# జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు

-సూదికొండలో స్థానికుల ఆందోళన

-ఎమ్మెల్యే దృష్టికి సమస్య : వజ్జ బాబూరావు

**పలాస, ఆగస్టు 13 (వార్త):** జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టవద్దంటూ పలాస పట్టణంలోని సూదికొండ ప్రాంతానికి చెందిన స్థానికులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. తమ నివాసాల మధ్య టవర్ ఏర్పాటుతో భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులపై వారు ఆందోళన వ్యక్తం చేస్తూ ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావును కలిసి సమస్యను వివరించారు. స్థానికుల విజ్ఞప్తిపై స్పందించిన బాబూరావు వెంటనే సూదికొండకు చేరుకుని సెల్ టవర్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి వారి అభ్యంతరాలు, సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వారి సమస్యను నిర్లక్ష్యం చేయబోమన్నారు. ప్రజల ఆందోళనను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లి, సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అభ్యంతరాలు పరిష్కారమయ్యే వరకు నిర్మాణ పనులు చేపట్టవద్దని అక్కడి గుత్తేదారులకు బాబూరావు సూచించారు. సూది కొండ ప్రాంత ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తమ సమస్యను తెలుసుకుని స్వయంగా ప్రాంతానికి వచ్చి పరిశీలించడంతో పాటు నిర్మాణ పనులు నిలిపివేయాలని సూచించిన బాబూరావుకు సూదికొండ కాలనీ మహిళలు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపడంపై హర్షం వ్యక్తం చేశారు. సూదికొండలో సెల్ టవర్ నిర్మాణంపై స్థానికుల అభ్యంతరాలకు బాబూరావు తక్షణమే స్పందించడం పట్ల బాబురావుకు సూదికొండ ప్రాంత ప్రజలు ఆయనను అభినందించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో స్థానికుల్లో కొంత ఊరట వ్యక్తమైంది. నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు అధికారుల పరిశీలన, నిబంధనలకు అనుగుణంగా ఎలా ఉంటాయన్నది వేచిచూడాల్సి ఉంది.





## క్రమశిక్షణే విజయానికి పునాది

-'డిసిప్లిన్ ఈజ్ ఇంపార్టెంట్ దాన్ ఇంటెలిజెన్స్'పై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

**పలాస, ఆగస్టు 13 (వార్త):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థుల మధ్య 'డిసిప్లిన్ ఈజ్ ఇంపార్టెంట్ దాన్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై వక్తృత్వ పోటీలు గురువారం నిర్వహించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో పాఠశాలలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రమశిక్షణ వ్యక్తిగత జీవితంతో పాటు విద్యా, సామాజిక రంగాల్లోనూ విజయానికి కీలకమనే అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలను స్పష్టంగా, ధైర్యంగా వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి వక్తృత్వ పోటీలు దోహదపడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

### విద్యార్థుల్లో విలువల వికాసానికి వేదిక

పోటీ అంశంగా ఎంచుకున్న 'క్రమశిక్షణ మేధస్సు కంటే ముఖ్యమైనది' అనే సందేశం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యాన్ని చాటింది. ప్రతిభతో పాటు సమయపాలన, బాధ్యత, నియమ నిబద్ధత, ఏకాగ్రత వంటి లక్షణాలు జీవితంలో విజయాన్ని సాధించేందుకు అవసరమనే విషయాన్ని విద్యార్థులు తమ ప్రసంగాల ద్వారా వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా, విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తి, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించే సందర్భంగా నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, వివేకానంద, హేమంత్, తారక్, గిరిధర్, హేమ తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

-15న ప్రతీ ఇంటా జాతీయ జెండా ఎగరాలి

- టీడీపీ కార్యాలయంలో నాయకుల విస్తృత స్థాయి సమావేశం

**మందస, ఆగస్టు 13(వార్త):** తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన ఆధ్వర్యంలో గురువారం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు మందస మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగిందన్నారు. పార్టీ కార్యక్రమాల రద్దీ కారణంతో, ప్రతీ నెలా రెండవ బుధవారం నిర్వహించాల్సిన మండల స్థాయి సమావేశాన్ని గురువారం నాటికి రీ-షెడ్యూల్ చేసి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మందస మండల పార్టీ అధ్యక్షుడు బావన దుర్యోధన మాట్లాడుతూ మండలంలో ఇటీవల చేపట్టిన 'డోర్ టు డోర్' కార్యక్రమం విజయవంతమైందని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పార్టీ పిలుపు మేరకు రాబోయే ఆగస్టు 15న ప్రతి ఒక్కరి ఇంట్లోనూ భారత జాతీయ జెండాను రెపరెపలాడించి, దేశభక్తిని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు స్వయంగా బస్సుల్లో ప్రయాణించి, మహిళా ప్రయాణికుల సమస్యలను తెలుసుకోవాలని, పథకం ప్రయోజనాలను వివరించాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బావన దుర్యోధనతో పాటు అరసవల్లి ఆలయ బోర్డు మెంబరు కొర్ల కన్నారావు, మండల ప్రధాన కార్యదర్శి సాలీన మాధవరావు, మందస, బాలిగాం పీఏసీఎస్ అధ్యక్షులు తమిరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, పార్టీ నాయకులు రాజాన మహేశ్, ముంజేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఎల్‌నినోపై అలర్ట్




**- రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

**-అంతర పంటలు, పంటల బీమా, రైతు రిజిస్ట్రేషన్, ఈ-పంట నమోదుపై అవగాహన**

**మందస, ఆగస్టు 13(వార్త):** ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు జిల్లా ఉన్నతాధికారులు కోరారు. ఈ మేరకు ఆత్మ(ఏటీఎంఏ) జిల్లా అధికారుల సమక్షంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పంటల సంరక్షణ చర్యలపై ఆయా కార్యక్రమాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

## నీటి వనరులను పొదుపుగా వినియోగించాలి

ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. నీటి వసతి ఉన్న రైతులు ఫార్మ్ పాండ్స్(నీటి కుంటలు), డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ వంటి పద్ధతుల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షాధార ప్రాంతాల్లో సాగు చేసే రైతులు నేలలో తేమను కాపాడుకోవడానికి తప్పనిసరిగా అంతర పంటలు సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉలవలు, కందులు, గంటెలు, జినుగులు వంటి పంటలను అంతర పంటలుగా వేసుకోవడం ద్వారా నేలలో తేమను నిల్వ ఉంచుకోవడంతో పాటు పంటలపై వాతావరణ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని తెలిపారు.

## పంటల బీమా, రైతు రిజిస్ట్రేషన్, ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రతీ రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్బీవై) కింద పంటల బీమా చేసుకోవాలని అధికారులు సూచించారు. అదేవిధంగా ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్, ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. ఈ మూడు అంశాలను రైతులందరూ పూర్తి చేసుకున్నట్లయితే, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం సంభవించినప్పుడు ప్రభుత్వం ద్వారా అందించే నష్టపరిహారం, బీమా ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

## వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

పలాస అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శారద మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి, ఇతర వ్యవసాయ పంటల్లో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. అంతర పంటల సాగు, నేలలో తేమ సంరక్షణ, పంటల బీమా వంటి అంశాలపై రైతులకు వ్యవసాయ సంబంధిత సూచనలు అందించారు.

## జీడి, కొబ్బరి తదితర ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు

కెవీకే ఆమదాలవలస కీటక శాస్త్ర నిపుణురాలు ఎస్.అనూష మాట్లాడుతూ, మామిడి, కొబ్బరి, జీడి తదితర ఉద్యాన పంటల్లో కనిపించే ప్రధాన కీటక సమస్యలు, వాటి నివారణ చర్యలను వివరించారు. ముఖ్యంగా జీడి తోటల్లో వేరు, కాండం తొలుచు పురుగుల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, కొబ్బరి పంటలో కొమ్ము పురుగు తదితర కీటకాల నియంత్రణకు పాటించాల్సిన పద్ధతులపై రైతులకు సమగ్రంగా వివరించారు. మొక్కలు నాటే దశ నుంచి తోటల పునరుద్ధరణ, పంట పూత మరియు పిందె దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలంకషంగా వివరించారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విజిట్ నిర్వహిస్తున్నారు. రైతుల పంటలను పరిశీలించి, వివిధ కీటకాలను గుర్తించడం, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను డెమో ద్వారా రైతులకు ప్రత్యక్షంగా వివరిస్తున్నారు.




## రైతుల సమస్యలపై చర్చ

రైతులు కూడా తమ సమస్యలను వివరిస్తున్నారు. రైతులకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన జీడి అంటు మొక్కలు అందించడంతో పాటు నీటి వసతి కల్పించేందుకు బోరుబావుల సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా శిక్షణలో పాల్గొన్న రైతులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే ఉద్యాన, వ్యవసాయ పంటల సాగు, సస్యరక్షణ, ప్రభుత్వ పథకాలు, పంటల బీమా తదితర అంశాలకు సంబంధించిన కరపత్రాలు, పత్రాలు, లిటరేచర్‌ను రైతులకు పంపిణీ చేశారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ, వాతావరణ మార్పులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో పలాస అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శారద, కెవీకే ఆమదాలవలస కీటక శాస్త్ర నిపుణురాలు ఎస్.అనూష, పలాస మండల ఉద్యాన శాఖ అధికారి సి.హెచ్.శంకర్ దాస్, ఏఓపాపారావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



# బద్రి ఎత్తిపోతల పథకానికి భద్రత కల్పించాలి

**- ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరందించాలి**

**- రైతుల సమస్యలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్తా:**

**- టీడీపీ నేత ధర్మాన తేజ్ కుమార్**



**సారవకోట, ఆగస్టు 13 (వార్త):** బద్రి ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి, సారవకోట మండల తెలుగుదేశం పార్టీ రథసారథి ధర్మాన తేజ్ కుమార్ అన్నారు. ఆయకట్టు రైతుల ఆహ్వానం మేరకు బద్రి ఎత్తిపోతల పథకాన్ని ఆయన గురువారం సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఇటీవల బద్రి ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు చోరీ చేసేందుకు ప్రయత్నించి, దాని కేబుళ్లను కోసి ధ్వంసం చేసినట్లు రైతులు తేజ్ కుమార్‌కు వివరించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ భద్రత, మరమ్మతులు, పథకం నిర్వహణకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడిన తేజ్ కుమార్, బద్రి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సమస్యలను నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు భద్రత కల్పించడంతో పాటు అవసరమైన మరమ్మతులు త్వరగా చేపట్టేలా సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా బద్రి ఎత్తిపోతల పథకం సమర్థవంతంగా పనిచేసేలా తన వంతు వ్యక్తిగత సహకారం కూడా అందిస్తానని తేజ్ కుమార్ హామీ ఇచ్చారు. ఆయకట్టు రైతుల సాగు సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మెండ శ్రీపతి, ధర్మాన పూర్ణ, శిమ్మ మన్మథరావు, స్థానిక రైతు మెండ నారాయణరావు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## సారవకోటలో విద్యార్థుల దేశభక్తి ర్యాలీ

**సారవకోట, ఆగస్టు 13(వార్త):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సారవకోట గ్రామంలో గురువారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలు ధరించి, చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తిని చాటుతూ విద్యార్థులు చేసిన నినాదాలు, జాతీయ నాయకుల వేషధారణలు స్థానికులను ఆకట్టుకున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం లభించి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ దేశభక్తి ర్యాలీని నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రమణ తెలిపారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సందేశాన్ని అందించారు.





# 80 అడుగుల జెండాతో విద్యార్థుల ర్యాలీ

**- సత్యవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు**

**నరసన్నపేట, ఆగస్టు 13(వార్త):** సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం నిర్వహించిన వేడుకల్లో భాగంగా విద్యార్థులు 80 అడుగుల భారీ జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాను చేతబూని విద్యార్థులు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు దేశం పట్ల బాధ్యత, క్రమశిక్షణ, ఐక్యత వంటి విలువలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

జాతీయ పండుగల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి భావనను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ర్యాలీకి స్థానిక గ్రామస్థులు కూడా సహకరించడంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు జాతీయ జెండా ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో 'నేను' కార్యక్రమం

**- విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపే లక్ష్యం**




**జలుమూరు, ఆగస్టు 13(వార్త):** విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో 'చనేను' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవీఆర్ఎస్ ప్రసాదరావు తెలిపారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థితో వ్యక్తిగతంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో దేశభక్తి, బాధ్యతాయుతమైన పౌరసత్వంపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులు దేశం పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండేలా ప్రాథమిక స్థాయి నుంచే వారికి అవగాహన కల్పిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడలు, క్విజ్, వ్యాసరచన పోటీలు



**నరసన్నపేట, ఆగస్టు 13(వార్త):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా క్రీడా పోటీలతో పాటు క్విజ్, వ్యాసరచన వంటి పోటీలను నిర్వహిస్తూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తున్నారు. గురువారం నరసన్నపేట మండలం గుండివిల్లిపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలను సంబంధిత అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ తీరును పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థుల్లో జ్ఞానం, సృజనాత్మకత, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## జేసీ దృష్టికి గ్యాస్ గడువు సమస్య



**ఇచ్ఛాపురం, ఆగస్టు 13(వార్త):** ఇచ్ఛాపురం అర్బన్ లో గ్యాస్ బుకింగ్ గడువు సమస్య పై మరోసారి జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు నియోజకవర్గ వైస్సార్సీపీ సమనవ్య కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి చెప్పారు. గతంలో గ్రీవిన్స్ లో 45 రోజుల గడువు 25 రోజుల కి కుదించాలని కోరినట్లు ఇదే సమస్య ఉన్న జగ్గంపేట మరియు రాజమండ్రి పరిసర ప్రాంతాల పరిధిలో ఉన్న మున్సిపాలిటీ లలో సమస్య పరిష్కారం అయ్యిందని చెప్పారు. మరి కొద్ది రోజుల్లో సమస్య కి పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రావులవలస పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ

**- నూతన భవనాన్ని త్వరగా వినియోగించాలని సూచన**

**- మధ్యాహ్న భోజనం తనిఖీ**

**నరసన్నపేట, ఆగస్టు 13(వార్త):** రావులవలస ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు గురువారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, త్వరితగతిన పనులు పూర్తిచేసి విద్యార్థుల వినియోగంలోకి తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం తీరును ఆయన పరిశీలించారు. వంట ఏజెన్సీ సభ్యులు భోజనం తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని సూచించారు. భోజన తయారీలో పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఎంఈఓ వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంఈఓ శాంతారావు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పాఠశాలలో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# పచ్చని ఉద్దానంపై విద్వేషం వద్దు

- ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములు ఇవ్వం
- పచ్చని పంటలకు ఉద్దానం నిలయం
- మాయమాటలతో మోసగించవద్దు
- కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ




**మందస, ఆగస్టు 13(వార్త):** పచ్చని ఉద్దానంపై విద్వేషం చిమ్మ వద్దని, ఆరు నూరైనా కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములు ఇవ్వమని కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు అన్నారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీ మీలగంగువాడలో గురువారం కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో గురువారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు కొమర వాసు, ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు మాట్లాడుతూ పచ్చని పంటలకు ఉద్దానం నిలయమని, అటువంటి ఉద్దానాన్ని అధ్వాన్నంగా చేయవద్దని కోరారు. మాయమాటలతో మోసగించవద్దన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పచ్చని ఉద్దానం భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీష భోగాపురం ఎయిర్‌పోర్ట్ అంశాన్ని కార్గో ఎయిర్‌పోర్ట్ సమస్యతో ముడిపెట్టి ఉద్దానం ప్రజలను తప్పుదోవ పట్టించే విధమైన ప్రకటనలు చేయడం తగదన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రభావిత గ్రామాలకు సంబంధం లేని వ్యక్తులను, కొద్దిమంది చిన్నారులను తీసుకెళ్లి ప్రజలకు వాస్తవ పరిస్థితులు భిన్నంగా చూపించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని కోరారు. ప్రభావిత గ్రామాలకు వెళ్లి అక్కడి రైతులు, నిర్వాసితుల పరిస్థితులను స్వయంగా పరిశీలించిన తర్వాతే ఎయిర్‌పోర్టుపై మాట్లాడాలన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు సంబంధించి సుమారు 400 ఎకరాల భూమికి ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదన్నారు. భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలోని ఉద్దానం ప్రాంతం పచ్చని కొబ్బరి, జీడి, పనస, మునగ, మామిడి తోటలతో సస్యశ్యామలంగా విరాజిల్లుతోందని, ఇక్కడ రైతుకు భూమి కేవలం ఆస్తి కాదు. అది తరతరాలుగా వారసత్వంగా అందిన నేలతల్లి అని అన్నారు. ప్రతి జీడి చెట్టు కింద రైతు చెమట ఉందని, ప్రతీ కొబ్బరి చెట్టులో ఒక కుటుంబం జీవనాధారం ఉందని, ముత్తాతలు, తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఈ భూములతోనే తరతరాలుగా రైతు కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా పెంచిన జీడి తోటలు, దశాబ్దాలుగా రైతు కుటుంబాలకు అండగా నిలిచిన కొబ్బరి చెట్లను తొలగించి కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామంటే రైతులు ఎలా అంగీకరిస్తారని కమిటీ ప్రశ్నించారు. ఈ చెట్లు మా పిల్లల చదువులకు అండగా నిలిచాయి. మా కూతుళ్ల పెళ్లిళ్లు చేశాయి. మా కుటుంబాలకు అన్నం పెట్టాయి. ఈ నేలను ఎలా వదులుకోమంటార ని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారని తెలిపారు. జీడి తోట ప్రతీ సంవత్సరం ఆదాయం ఇస్తుందని, కొబ్బరితోట నిరంతరం జీవనాధారాన్ని అందిస్తుందన్నారు. పచ్చని తోటలను తొలగించి కాంక్రీట్ నిర్మాణాలు చేయడం అభివృద్ధి పేరుతో రైతు భవిష్యత్తును నాశనం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉద్దానం అంటే భూమి కాదు.. ఓ జీవన సంస్కృతి

ఉద్దానం ప్రాంతం కేవలం వ్యవసాయ భూములతో కూడిన ప్రాంతం కాదని, అది ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ జీవన విధానానికి నిలయమని వారు తెలిపారు. గ్రామ దేవతల ఆలయాలు, పూర్వీకుల జ్ఞాపకాలు, తరతరాలుగా కొనసాగుతున్న కుటుంబ బంధాలు, పండుగలు, వ్యవసాయ సంప్రదాయాలు అన్నీ ఈ నేలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ పేరుతో భూములు కోల్పోతే కేవలం రైతు ఆస్తి మాత్రమే కాదు.. ఒక గ్రామం, ఒక జీవన విధానం, ఒక సంస్కృతి కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### అభివృద్ధి ఎవరి కోసం?

అభివృద్ధి కావాలి అంటే ఎవరూ వ్యతిరేకించడం లేదని, కానీ అభివృద్ధి పేరుతో రైతుల జీవనాధారాన్ని నాశనం చేయడాన్ని మాత్రం అంగీకరించబోమని కమిటీ నాయకులు స్పష్టం చేశారు. రైతు కన్నీళ్లపై నిర్మించే రన్‌వేను, రైతు భూములపై నిర్మించే కార్గో టెర్మినల్‌ను నిజమైన అభివృద్ధి అని ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. తోటలు పీకేస్తే విమానాలు వస్తాయి.. కానీ అన్నం ఎవరు పండిస్తారని ప్రశ్నించారు. ఉద్దానం జీడికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ జీడిని పండించే రైతు చేతులనే భూమి పేరుతో దూరం చేస్తే ఆ గుర్తింపును ఎవరు కాపాడుతారని ప్రశ్నించారు.


### రైతుల సహనాన్ని పరీక్షించవద్దు

స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తర్వాత కూడా గ్రామీణ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలు పూర్తిస్థాయిలో అందకపోవడం వల్లే ఉద్దానం ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలు పుట్టుకొచ్చాయని కమిటీ నాయకులు పేర్కొన్నారు. అలాంటి చారిత్రక పోరాటాల నేల అయిన ఉద్దానం ప్రజల మనోభావాలను పాలకులు అర్థం చేసుకోవాలని సూచించారు. రైతుల సహనాన్ని పరీక్షిస్తే పరిస్థితులు మరోసారి ప్రజా ఉద్యమాల వైపు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉద్దానం రైతులు అభివృద్ధికి వ్యతిరేకులు కాదు. కానీ తమ జీవనాధారమైన భూములను కోల్పోయే అభివృద్ధిని మాత్రం వ్యతిరేకిస్తున్నారు. పచ్చని ఉద్దానాన్ని కాపాడుదాం నేలను కాపాడితేనే రైతు బతుకుతాడు.. రైతు బతికితేనే ఉద్దానం బతుకుతుందని బాధిత రైతులు స్పష్టం చేశారు. అందువల్ల ప్రభుత్వం కార్గో ఎయిర్‌పోర్ట్ కోసం భూములు కోల్పోయే రైతులు, నిర్వాసితుల అభిప్రాయాలను గౌరవించాలని, ప్రభావిత గ్రామాల్లోకి వచ్చి ప్రజలతో నేరుగా చర్చించాలని, రైతుల జీవనాధారాన్ని కాపాడే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొట్టి ధర్మారావు, దున్న హరికృష్ణ, గుంటు లోకనాథం, పొట్టి దేసయ్య, చిత్త గున్నయ్య, చిత్త సంతోష్, పొట్టి రామారావు, బొడ్డు దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల కుక్, కమాటిలను తొలగించొద్దు

- ఔట్‌సోర్సింగ్ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి డిమాండ్

**సారవకోట, ఆగస్టు 13(వార్త):** ఆశ్రమ పాఠశాలల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కుక్, కమాటి ఉద్యోగులను తొలగించడం సరికాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యోగి అన్నారు. సారవకోటలో బుధవారం సయంత్రాం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 32 ఆశ్రమ పాఠశాలల్లో పలువురు గిరిజనులు కుక్, కమాటి ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను తొలగించి, ఔట్‌సోర్సింగ్ పేరుతో ప్రైవేట్ సంస్థకు బాధ్యతలు అప్పగించే నిర్ణయం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఆయా ఉద్యోగాలను నమ్ముకుని జీవిస్తున్న గిరిజన కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో అనుభవంతో పనిచేస్తున్న స్థానిక ఉద్యోగుల సేవలను కొనసాగించాలని, ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని యోగి డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వారికి న్యాయం చేయాలని కోరారు.





## సారవకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకలు

- విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

**సారవకోట, ఆగస్టు 13(వార్త):** సారవకోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మడ్డు వెంకటరమణ పాల్గొని విద్యార్థులకు స్వాతంత్ర్య ఉద్యమ విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ దేశ నాయకుల వేషధారణలో అలంకరించుకుని అందరినీ ఆకట్టుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల పాత్రలను ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



## ఇంజనీరింగ్ ఉద్యోగాన్ని వదిలి.. ఆదర్శ రైతుగా..!

- ఆధునిక సాగు పద్ధతులతో ఎకరాకు 40 బస్తాల దిగుబడి
- వ్యవసాయంపై మక్కువతో సొంతూరికి చేరుకున్న యువకుడు




**నరసన్నపేట, ఆగస్టు 13(వార్త):** వ్యవసాయంపై ఉన్న మక్కువతో మంచి ఇంజనీరింగ్ ఉద్యోగాన్ని సైతం వదిలి సొంతూరికి చేరుకున్న ఓ యువకుడు ఆధునిక సాగు పద్ధతులతో ఆదర్శ రైతుగా నిలుస్తున్నారు. జమ్ముకు చెందిన సతీష్ ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నారు. సతీష్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ పూర్తి చేసి మంచి ఉద్యోగాన్ని సంపాదించారు. అయితే చిన్ననాటి నుంచి వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో ఉద్యోగ జీవితానికి స్వస్తి పలికి స్వగ్రామానికి తిరిగి వచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా వినూత్న సాగు విధానాలను అవలంబిస్తున్నారు. ఆధునిక యాంత్రీకరణను వినియోగిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే దిశగా ఆయన సాగు చేస్తున్నారు. శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ యంత్రాలను సమర్థంగా వినియోగించడం ద్వారా ఎకరాకు ఏకంగా 40 బస్తాల వరకు దిగుబడి సాధిస్తున్నట్లు తెలిపారు. చదువుకుని మంచి ఉద్యోగం సాధించినప్పటికీ వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్న సతీష్.. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంతో అనుసంధానం చేస్తే తక్కువ పెట్టుబడితోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. వ్యవసాయాన్ని భారంగా కాకుండా శాస్త్రీయ దృక్పథంతో చేపడితే మంచి ఆదాయం పొందవచ్చని సతీష్ సాగు విధానం చాటిచెబుతోంది. యువత వ్యవసాయ రంగం వైపు ఆకర్షితులై ఆధునిక పద్ధతులను అవలంబిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## కన్నారావుకు పదవి ముదావహం

- సూర్యభగవానుని ఆశీస్సులు 'కొర్ల'పై ఉండాలి
- మరింత ఉన్నతస్థాయికి ఆయన ఎదగాలి : టీడీపీ నేతలు
- టీడీపీ కార్యాలయంలో ఘన సన్మానం


**మందస, ఆగస్టు 12(వార్త):** సమాజసేవకునిగా కొర్ల కన్నారావు ఎంతో పేరు గడించారు.. పేదలకు ఆయన చేస్తున్నసేవలు చిరస్మరణీయం.. ఆయన మంచి ఆధ్యాత్మికవేత్త. కన్నారావుకు అరసవల్లి ఆలయ బోర్డు సభ్యునిగా పదవి లభించడం అందరికీ ఆమోదయోగ్యమని పలువురు వక్తలు అన్నారు. పార్టీ అభివృద్ధికి, నియోజకవర్గ ప్రగతికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగానే ఈ పదవి లభించిందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీఅరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నూతనంగా నియమితులైన క్లస్టర్ ఇన్‌చార్జ్ కొర్ల కన్నారావు పదవి లభించడం శుభసూచికమన్నారురు. అనంతరం హరిపురం కార్యాలయంలో కన్నారావు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. అనంతరం కొర్ల కన్నారావు మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో, పార్టీ అగ్ర నాయకత్వ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆలయ సేవలలో తనవంతు పూర్తి బాధ్యత వహిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధనతో పాటు మండల ప్రధాన కార్యదర్శి సాలీన మాధవరావు, మందస, బాలిగాం పీఏసీఎస్ అధ్యక్షులు తమిరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, పార్టీ నాయకులు బమ్మిడి కర్రయ్య, రాజాన మహేశ్, ముంజేటి చంద్రశేఖర్, ఔగాన ఈశ్వరరావు, చౌదరి మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వాండ్రాయి ప్రభుత్వ పాఠశాలలో ..జంగిల్ క్లియరెన్స్

- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టిన అధికారులు

**సారవకోట, ఆగస్టు 13(వార్త):** వాండ్రాయి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో పెరిగిన మొక్కల తొలగింపుపై ఉపాధి హామీ అధికారులకు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. సమస్యపై స్పందించిన అధికారులు ఉపాధి హామీ పథకం కింద వేతనదారులను ఏర్పాటు చేసి గురువారం పాఠశాల ప్రాంగణంలో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. అధికారులు సకాలంలో స్పందించి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546